మా అయ్యని సంపేత్తావని ఓ గుంపు సేరింది !'' అందా పిల్ల. అప్పుడు దాని గొంతు వణికింది, కళ్ళలో నీళ్ళు తిరిగై.

అప్పటి కర్థమైంది నాకు — తాగుబోతు వెధవలంతా యేదో తగూపడి బుర్రలు పగలగొట్టు కొంటున్నారని.

''నేనేం చేసేదే? అయితే ! పోలీసుల కాడికి పోకపోయినా ?'' అన్నాను విసుగ్గా.

''మాంపోతే ఆళ్ళు పట్టించుకోరని మా బందుగులంటన్నారయ్యా !''

''అయితే కొట్టుకొ చావమను, నాకు వేరే పనేంలేదా ?'' అని విదిలించి, దాన్ని పొమ్మన్నట్టు సూచిస్తూ వెనక్కి తిరిగాను.

బల్లమీద నేను సగం రాసిన కధ తాలూకు కాగితాలు కనిపించినై.

నాకు ఎదురు తిరిగిన పాత్ర అకస్మాత్తుగా కేకలేయడం ప్రారంభించింది — ''నీ నీతులేమైనై? నీ ఔదార్యం ఏ వుట్టికెక్కింది ? నీ నౌకర్నే కాపాడలేవా ?'' అన్నవ్వుతూ.

''అయ్యా !'' రత్తి దీనంగా పిల్చింది.

అటు తిరిగాను. ఆ క్షణం — ''దాని తండ్రి పరిస్థితిలో నేనూ, దాని చోట్లో నా కొడుకూ వుంటే ?'' అనిపించింది. నా వళ్ళు జలదరించింది.

వణుకుతున్న చేత్తో ఫోనెత్తి, పోలీస్ స్టేషన్‌కి లైను కలిపాను.

నా గొంతు వినంగానే కంగారు పడిన ఎస్సైని సముదాయించి, నా నౌకరు సమస్య వివరించి, పది నిమిషాల్లో వస్తున్నాను, బలగంతో సిద్ధంగా వుండమని చెప్పాను.

వెనక నించి వెక్కిళ్ళు వినిపిస్తుంటే, వులిక్కిపడి అటు తిరిగాను.

''మా అయ్యను సంపేత్తారా బాబూ ?'' అమాయకంగా అడుగుతూ ఏడుస్తుందా పిల్ల.

సహజంగా మంచివాడ్నవడం వల్లో, కాకుంటే మంచివాడ్నని నన్ను నేనే హిప్నటైజ్ చేసుకొన్నందు వల్లో ఆ పరిస్థితి నన్ను కదిలించింది.

''పద'' అంటూ బైటకి నడిచాను.

ఆ పిల్లని నాతో కార్లో ఎక్కించి తీసికెళ్లటం నాకసహజంగా తోచలేదప్పుడు ! పది నిమిషాల్లో పోలీస్టేషన్ ముందు కారాపి దిగాను. ఎస్సై స్టేషన్లోంచి ఎదురొచ్చాడు.

''వెళ్దామా ?'' అడిగాను వెంటనే.

''కరెక్ట్ స్పాటెక్కడో తెల్సా మీకు ?'' అడిగాడు ఎస్సై.

''ఇదిగో యీ పిల్లుందిగా! యిది మా నౌకరు కూతురు'' అన్చెప్పాను.

ఇంతలో హెడ్ కానిస్టేబుల్ మా దగ్గరకొచ్చి ఎస్సైతో ''సార్ ! డియెస్పీగారు ఫోన్చేస్తున్నారు'' అన్నాడు.

''ఒక్క నిమిషం'' అంటూ లోపలికెళ్ళాడు ఎస్సై.

రత్తిని అక్కడున్న బల్లమీద కూర్చోమన్చెప్పి, నేనూ లోపలికెళ్ళాను.

అప్పటికే ఎస్సై ఫోన్లో చెబుతున్నాడు — ''ఔన్సార్ ! ఇప్పుడే రిపోర్టు చేసారు. వారి నౌకరు కూడా వున్నాట్ట ... అక్కడికే బయల్దేరుతున్నాం'' అని అవతల్నించి వినిపించే మాటల్ని ఓ నిమిషం విన్నాడు.

అతని ముఖంలో రంగులు మారసాగాయి ''—అట్లాగా సార్ ! ఓహో అదా విషయం... సరే సార్... మీరూ ఓమాట వారితో చెబ్తే—'' అని యింకో నిమిషం విని, నాకేసి తిరిగాడు ఎస్సై. మౌత్‌పీస్‌కి చెయ్యడ్డుపెట్టి — ''డీయెస్పీ సాబ్ మీతో మాట్లాడతార్ట !'' అని చెప్పి ఫోను నాకందించాడు.

ఫోనందుకోని —''హల్లో ! గుడ్ మార్నింగ్'' అన్నాను.

డీయెస్పీ అవతల్నించి గబగబా చెప్పసాగాడు — ''సార్ ! ఆ గూడెం గలాటా చిన్నది కాదండి ... దాని వెనక చాలా భాగోతం వుంది... అన్నట్లు హైదరాబాద్ నించి ధర్మయ్య గారొచ్చారు మీకు తెల్సా ? వారు మీకు బాగా స్నేహితులు కదా ! వారితో మాట్లాడండి... ఆ గొడవ విషయం మీకు చెప్పే విధంగా చెబ్తారు... నేనిప్పుడు వారి దగ్గ ర్నించే మాట్లాడుతున్నాను, ఓ రెండ్నిమిషాలు లైన్లో వుండండి.''

మౌత్‌పీస్‌కు చెయ్యడ్డం పెట్టి, యస్సైకేసి తిరిగి ''ధర్మయ్యగారొచ్చారా ! ? నాకు తెలియనే లేదే !'' అన్నాను.

''ఔన్సార్ ! గంట క్రితమే వచ్చారు.'' అన్నాడు ఎస్సై.

ఇంతలో ధర్మయ్యగారి గొంతు వినిపించింది ఫోన్లో —

''హలో బాగున్నారా? ఏమిటి విశేషాలు ?'' అని కుశలం కనుక్కోసాగారాయన.

''ఆ బాగానే వున్నా సార్ ? ఏమిటి వచ్చే ముందు యింటిమేషన్లేదు, వచ్చింతర్వాతైనా కబురు చేయలేదు—'' అని నిష్ఠూర మాడబోయాను.

''అర్జంటు పనొస్తగిలి అనుకోకుండా వచ్చాను... చాలా సీరియస్ విషయం... సాయంత్రం వేనే మీ దగ్గరి కొద్దామను కొంటున్నాను, యీ పని పూర్తవగానే ! అన్నట్టు— ఆ గూడెం గొడవలో మీ కేమిటి యింట్రస్టు ?'' అడిగారు ధర్మయ్యగారు.

''మా నౌకర్ని, ఆ గూడెం వాళ్లని మరి కొందర్ని తంతావని ఎవరో వచ్చార్ట! వాడి కూతురు యేడుస్తూ నా దగ్గరి కొచ్చింది... వెంటనే పోలీస్ రిపోర్టిచ్చాను. స్టేషన్లోంచి రాంగానే మీ విషయం తెల్సింది.''

''అలాగా... మీక్కొన్ని విషయాలు చెప్పాలి— ఎస్సై ఆ సంగతి చూస్తాడ్లెగాని —మీరర్జంట్‌గా యిక్కడికి రండి'' అని ఆహ్వానించారాయన.

''గెస్ట్‌హౌస్‌లోనే కదా బస ?'' అడిగాను.

''ఔను... చాలా అర్జంటు, వెంటనే రండి'' అని ఫోను పెట్టేసారాయన.

నేనూ ఫోను పెట్టేసి, నా ముఖంలోకి ఏదో వెతుకుతున్నట్టు చూస్తున్న యస్సై దగ్గర శలవు తీసుకోని బైటకొచ్చాను.

నన్ను చూడంగానే కళ్ళు తుడుచుకొంటూ లేచి నించుంది రత్తి. నా మనసు చివుక్కుమంది.

''అసే ! ఎస్సైబాబు వెళ్ళి ఆ తగూ సర్చేస్తార్లెగాని, నువ్వు మా యింటికెళ్ళు. గూడేనికి పోకప్పుడే !'' అని మరో మాటకు తావివ్వకుండా చకచకా వెళ్ళి, కారెక్కి స్టార్టు చేసాను.

* * *

''ఏదో కథలాసుకోడం, వ్యాపారంలో డబ్బులు సంపాదించుకోడవేగాని మీకీ రాజకీయాలు తెలియవాయ్ ! మొత్తం ఆ గూడెంలో యేడుగురు రౌడీవెధవలు చేరి, రెండువేల వోట్లు గుప్పిట్లో పెట్టుకొన్నారు .. మనం ప్రజల ముఖాలు చూట్టం లేదనీ, వాళ్ళ కష్టాలు పట్టించుకోడం లేదనీ ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు ఆ గూడెం తగూ జోలికి మనం పోగూడదు... అర్థమైందా ? మీ నౌకరు పేరేవిటన్నారు ?'' అడిగారు ధర్మయ్య గారు.

ఎయిర్‌కండిషన్ చేయబడ్డ ఆ గదిలో, మెత్తని సోఫాల్లో నేనూ, ధర్మయ్యగారు, ఇద్దరు ఉన్నతాధికారులు, మరో ముగ్గురు పెద్దమనుషులూ కూర్చోనున్నాం.

''మా నౌకరు పేరు రాములు... కొల్లు రామయ్య అనుకొంటా'' అన్నాను.

''కొల్లు రామయ్య'' అని రెండు మూడు సార్లనుకోని ధర్మయ్యగారు లాల్చీ జేబులోంచి ఓ కాయితం తీసి మడత విప్పి చూసి — ''కొల్లు రామయ్య'' అనే ఒక్క మాటనే ఓ నిమిషం రాగయుక్తంగా పాడుకోని, ఆపి, డియెస్పీకేసి అదో రకంగా చూసారు.

విషయంలో లొసుగెక్కడుందో నా కర్థమైంది. పదేళ్ళుగా నా దగ్గర పన్చేస్తున్న నా నౌకరు శక్తిని గుర్తించనందుకు నాకు విచారం కూడా వేసింది !

''వాళ్ళకి సౌకర్యాలు కల్పించి, వారి మన్నన పొంది, ఓట్లు సంపాదించాలేగాని... యీ విధంగా—'' అని నసుగుతున్న నన్ను ధర్మయ్యగారు మధ్యలోనే ఆపేసారు.

''మా యిబ్బందులు మాకూ వుంటయ్. మేధావులైన మీలాటి మా సానుభూతిపరులే అర్థం చేసుకోకపోతే ఎట్లా ? కాసేపా సంగతి మానేసి మిగతా విషయాలు మాట్లాడండి — అన్నట్లు — మీ రచనలకి ప్రభుత్వ ఎవార్డుకోసం యేవీ ప్రయత్నం చేయడం లేదా ? అంత బాగా రాస్తారు కదా ... ఈ సారి నేనూ మీ విషయం కదిపి చూస్తాను'' చిర్నవ్వులో అన్నారు ధర్మయ్యగారు.

నా వళ్ళు పులకరించింది ! నిజానికి అలాంటి ఎవార్డు నా కెప్పుడో రావల్సింది. ధర్మయ్యగారి వంటి స్నేహితులున్నా, నా శక్తిమీద నాకున్న నమ్మకం అంతదాకా అడ్డదార్లు తొక్కనీయలేదు నన్ను.

''ఆఁ ! ఎవార్డుల్దేముందిలెండి ! మీ వంటి వారి అభిమానం చాలదూ — '' అని నాన్నాను.

''భలేవారే ! అదేవన్నమాట ? మనమేమైనా అక్రమంగా అడుగుతున్నామా ... మన వద్ద అర్హత వుంది ... అందుకని గుర్తింపుకోసం మనవంతు ప్రయత్నాలు మనం చేస్తాం. ఈసారి నేను మీ గురించి సజెస్ట్ చేస్తాను'' అన్నారాయన.

నా మీదా నా రచనలమీదా ఆయనకున్న అభిమాన మలాటిది మరి !

తర్వాత ఓ అరగంట ఆయన ప్రస్తుతం నేను

చేస్తున్న రచనల గురించి, నేను ఆయన రాజకీయాలను గురించి అదుక్కొంటూ కాలక్షేపం చేసాం. ఇంతలో టెలిఫోన్ మోగింది.

డియెస్పీ రిసీవర్ తీసి, మాట్లాడసాగారు — "ఆఁ! ఎస్ ఎస్! ఉన్నారమ్మా! యిక్కడేవున్నారు! యిదిగో . . మాట్లాడతారు" అంటూ రిసీవర్ని నాకందిస్తూ — "మీ వైఫ్ ఫోన్ చేస్తున్నారు" అన్నారు.

నా కెందుకో కంగారు వేసింది — "హలో శాంతా! ఏవయింది? నేనిక్కడున్నానని నీకెలా తెల్సు?" అనడిగాను.

"పోలీస్స్టేషన్‌కి ఫోను చేస్తే, ఎస్పై మీరక్కడ వున్నారని చెప్పారు. ఏవండీ! మన రాములు కూతురొచ్చి, దాని తండ్రిని, వాడివైపువార్ని ఎవరో చంపడానికొచ్చారని చెప్పింది. ఇంతలో మన సురేషూ, వాడి ఫ్రెండు ఆనంద్ వచ్చి ఈ విషయం విని గూడేనికి వెళ్ళారు—నేనెంత చెప్పినా వినకుండా—నా కెందుకో భయంగావుంది... మీరూ ఆ గొడవ సంగతి రత్తిని తీసికెళ్ళి ఎస్పైతో చెప్పార్టగా! ఏమైంది?" అని అడగసాగింది శాంత.

నాకు చెమటలు పోసాయి, ఒక్కసారిగా చేతులు వణకసాగాయి. అయినా సాధ్యమైనంత గంభీరంగా— "నువేం కంగారు పడకు! నేను తీసుకొస్తాలే సురేషునూ, వాడి స్నేహితుడ్నీ ... యేం భయంలేదు" అని ఫోను పెట్టేశాను.

"డియెస్పీ సాబ్! నా నౌకరు కూతురు నా కొడుకునూ, వాడి ఫ్రెండ్‌నీ వెంట బెట్టుకోని గూడేనికి వెళ్ళిందట. వెంటనే పోదాం పదండి" అంటూ కంగారుగా లేచి నించున్నాను.

డీయెస్పీ ఆశ్చరంగా ధర్మయ్యగారి ముఖం వంక చూసాడు.

"ఏంటి సార్ ఆలోచన? పదండి! నా కొడుకసలే చాలా రేష్‌ఫెలో! వాడికి అన్యాయాన్నెక్కడ చూసిన వళ్ళు మండుతుంది... ఆ గొడవలో ఏమౌతాడో ఏంటో" అని తొందర పెట్టాను.

డీయెస్పీ యేంచేద్దామన్నట్టు ధర్మయ్యగారి కేసి చూసాడు. నేనూ ధర్మయ్యగారి కేసి తిరిగాను. ఆయన ముఖంలో ఆశ్చర్యం, అప్రసన్నతా కనిపించినై నాకు.

"ఈ కాలంలో పిల్లలంతా యింతేనండీ ... ప్రతీది వీళ్ళకే కావాలి! ఏ మాత్రం అనుభవం వుండదు... వీళ్ళకెందుకు చెప్పండి యీ గొడవలు? వాళ్ళ మానాన్న వాళ్ళు చదువులేవో చూసుకోక!"

# మలుపు

అని విసుగ్గా అన్నారాయన.

"ప్లీజ్ ధర్మయ్యగారూ! ఆ విషయాలన్నీ తర్వాత! ముందు వాడ్ని రక్షించాలి... లెటజ్ గెట్ గోయింగ్... క్విక్" అన్నాను.

టైము చూసుకొంటూ, ధర్మయ్యగారు యేమాత్రం కంగారు పడకుండా స్పష్టంగా, దృఢంగా చెప్పారు— "మనం మరో గంటదాకా ఆ ఛాయలక్కూడా వెళ్ళానికి వీల్లేదు, వెళ్ళడం లేదు" అని.

నా కప్పటి కర్థమైంది.

రాజకీయంలో నా కొడుక్కీ, నా నౌకరికీ ఒకటే విలువని — అది తన కడ్డొచ్చిన ప్రతీవారినీ నీ, నా భేదాలూ, ఎలాటి మినహాయింపులూ లేకుండా దహించేస్తుందనీ! నా మతి పోయింది!

ఒక్కసారిగా నాకు ఒళ్ళు తెలీని వుద్రేకం కలిగింది. రాతి బొమ్మల్లా, గుడిలోని విగ్రహాల్లా కూర్చొనున్న వారందర్నీ సంబోధించి పళ్ళు కొరుకుతూ చెప్పాను—"ప్రజాస్వామ్యపు ముసుగులోని యీ నాటకం ఎంతో కాలం సాగదు" అని!

ఆ క్రూర జంతువులున్న గుహలోంచి ఒక్క వుదుట్న బైటికొచ్చి, నా కార్లో కూర్చుని, స్టార్ట్ చేసి, పిచ్చి వేగంతో నడపసాగాను.

ఉన్మాద స్థితిలో గూడెంలోకి కారును తిప్పి, నిర్మానుష్యంగా వున్న ఆ ఎగుడు దిగుడు యిరుకు వీధుల్లో కారును వేగంగా పోనిస్తూ వెతుకుతున్నాను నా కొడుకు కోసం, దొమ్మి జరుగుతున్న స్థలం కోసం.

ఆ మలుపు తిరగంగానే కారును షడన్ బ్రేక్‌తో ఆపాను.

అక్కడ కనిపించింది నాకు — ఓ పదిమంది గొడ్డళ్ళతో, కత్తులతో, కర్రలతో ఒకతన్ని పొడ్చించి చావగొడుతుండటం. నా కారు శబ్దం విని వారా కార్యక్రమం ఆపి నావైపు తిరిగారు.

ఆ రక్తం మడుగులో వున్నది సురేషే!?

నా రక్తం పొంగింది, నా కండలు బిగుసుకొన్నై.

నా ఔదార్యం, నా బోధనలు నా కొడుకుని ఆ క్రూరుల బారినించి కాపాడలేవు!

"అరేయ్" అని దిక్కులు పగిలేలా అరుస్తూ, కారులోంచి యినపకడ్డీ తీసుకోని కిందకి వురికాను.

వాళ్ళు ఆశ్చర్యంగా నా వంక ఓ క్షణంసేపు చూసి, తెప్పరిల్లి అక్కడ్నించి ఒక్క పరుగుతీసి మాయమైనారు.

ఆరడుగుల దృఢమైన నా శరీరం చూసి వారు పారిపోలేదనీ, వారి పని పూర్తయినందునే నిష్క్రమించారనీ నాకు తెల్సు.

ఆత్రంగా పరుగు తీసాను, రక్తం మడుగులో కొట్టుకొంటున్న ఆకారం దగ్గరికి.

ఈ దురదృష్టవంతుడు యెవరో నాకు తెలీని వృద్ధుడు! నా సురేషు కాదు!! పట్టలేని సంతోషంతో వాడికోసం వెతకసాగాను

ఆ సంతోషం ఎంతోసేపు మిగలలేదు — నా అన్వేషణలో దొరికిన ఏడో శవం నా సురేషుది! ఎనిమిదోది వాడి స్నేహితుడిది!!

నన్ను ఎక్కడ్లేని నిర్లిప్తతా ఆవరించింది. నా మనసు మొద్దుబారింది.

దురదృష్టవశాత్తు ఆపాటి అదృష్టం కూడా నాకు మిగల్లేదు, మరో రెండు శవాలు చూసి నా హృదయం పగిలింది!

కాళ్ళూ, చేతులూ లేని రామయ్య మొండెం, ఆ మొండెం గుండెల మీద వళ్ళు తూట్లు తూట్లుగా పొడవబడ్డ రత్తి శవం!

పదేళ్ళ పసిపాప! రెండు గంటల క్రితం — నా గదిలో— తన తండ్రిని రక్షించమని వేడుకొన్న మాయలు తెలియని పిల్ల!

"నా తండ్రిని చంపేస్తారా?" అని దీనంగా అడిగిన ఆ పిల్ల, తన తండ్రి గుండెలపై కవచంలా అడ్డుపడి ప్రాణాలు విడిచిందా?

నా గుండె పగిలింది! నా కళ్ళనించి నీళ్ళు జల జలా రాలాయి.


ఏ రాజకీయం కోసం, ఏ న్యాయం కోసం, ఏ ధర్మ సంస్థాపనార్థమయ్యా పదేళ్ళ పసిపిల్ల ప్రాణం బలి పెట్టబడింది??


ఒక్క గుడిసె తలుపూ తెరుచు కోవడంలేదు, మరో మనిషి వీధిలోకి కాలు బెట్టడం లేదు.

ఇంతలో సైరను మోగించుకొంటూ పోలీస్ వాన్లు, తదితర వాహనాలు మహావేగంతో వచ్చి ఆగాయక్కడ.

పోలీసులు, వారి ఫొటో గ్రాఫర్లు బిల బిల మంటూ దిగి, శవాల్ని గాలించి ఫొటోలు తీసారు. పది నిముషాల్లో శవాల్ని ఎక్కించుకోని అంబులెన్సులు వెళ్ళిపోయాయి.

అప్పుడు తలుపులు తీసుకోని, జనం గొల్లున యేడుస్తూ వీధుల్లోకి వచ్చారు!



# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి





## జలుబును పోగొట్టుకోవచ్చు


ముక్కు కారడం, ముక్కు దిబ్బడ. తలభారం, గొంతు నొప్పి. గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.


# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 Tel


# మ లు పు

అరగంటలో గూడెం జనంతో, ఊళ్లోని ప్రజలతో ఆ ప్రదేశం నిండిపోయింది. వారిలో నా స్నేహితులు, అనుచరులూ, నా కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగస్తులు వున్నారు.

ఎవరెవరో నా చుట్టూచేరి ఏదో అడుగుతున్నారు, స్వాంతన వచనాలు పలుకుతున్నారు.

అప్పుడు నా సెక్రటరీ, శాంతని వెంటబెట్టుకొని అక్కడి కొచ్చాడు.

నిస్తేజంగా నిలబడి వున్న నా దగ్గరకొచ్చి — ''ఏమైందండీ మన సురేషుకు ?'' అనడిగింది శాంత.

ఏం చెప్పాలో నాకు తోచలేదు. గొల్లున యేడవసాగింది శాంత !

ఇంతలో ధర్మయ్యగారు మా దగ్గరికి గబ గబా వచ్చారు. నా భుజం చుట్టూ చేయివేసి, నన్నో దారుస్తున్నట్లు నించున్నారు.

విలేఖర్లు ఫోటోలు తీసుకొన్నారు ! బహుశా రేపటి పేపర్లలో పడొచ్చు — ధర్మయ్యగారు వెంటనే వచ్చి సానుభూతి తెలిపారు అనే వ్యాఖ్యానంతో !!

అంతేగాదు — ధర్మయ్యగారు స్టేట్‌మెంట్ కూడా యివ్వొచ్చు — తన వర్గంలోని నా నౌకర్ని, నా కొడుకును, వాడి స్నేహితుడ్ని ముగ్గుర్నీ— కేవలం ముగ్గుర్నే—చంపేసారని, యిది అప్రజాస్వామికమైన ప్రత్యర్థుల పిరికి చర్యనీ, దోషుల్ని వెంటనే పట్టుకొని శిక్షిస్తామని.

ధర్మయ్యగారి చేతుల్లోంచి తప్పుకొని, నా సెక్రటరీని పక్కకు పిల్చి చెప్పాను — ''శాంతని తీసుకొని హాస్పిటల్‌కి వెళ్లు. వాళ్లు సురేష్ బాడీని యివ్వగానే యింటికి రండి'' అని.

''మరి మీరూ ?'' అడిగాడు నా సెక్రటరీ ఆశ్చర్యంగా.

''ఇంట్లో వుంటాను'' నేను నటిస్తున్న నిబ్బరానికి ఆశ్చర్యపోతున్న నా సెక్రటరీకి ఆ మాటలు చెప్పి, నా కారు దగ్గరకొచ్చాను.

* * *

నా గదిలోకి అడుగుపెట్టగానే — నేనంతకు ముందు సగంలో వదిలేసిన నా రచన తాలూకు కాగితాలు రెపరెపలాడుతూ కనిపించాయి.

''రావయ్యా రా ! యిప్పుడర్థమైందా నా కడుపుమంట ? రా ! మన సమస్యలకు సరైన పరిష్కారముంది, ఖచ్చితమైన లక్ష్యముంది, శాస్త్రీయమైన మార్గముంది ! వచ్చి నాతో కలువ్!'' అంటూ ఆహ్వానించింది నా నాయక పాత్ర.

ఆప్యాయంగా ఆ కాయితాలు, కలం చేతిలోకి తీసుకొన్నాను, బల్లముందు కూర్చుంటూ. ఆ పాత్ర కిప్పుడు మనస్ఫూర్తిగా సహాయ పడుతున్నాను. బాహ్యలోకం మర్చిపోయాను. నా రచన చకచకా సాగుతోంది.

కానీ నాకు తెల్సు — ఈ రచనకు ప్రభుత్వ బహుమానం లభించదనీ, బహుశా నిషేధింపబడవచ్చు కూడా ననీ !! అయినా నా రచన అగదు— ముంచుకొస్తున్న భవిష్యత్తు వలెనే !! ●